# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 09 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## కొత్త రేషన్ కార్డుల జారీ కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు



బలగం టీవీ, హైదరాబాద్

కొత్త రేషన్ కార్డుల జారీ కోసం కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ గురువారం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్ గా, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహా, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను సభ్యులు గా నియమిస్తూ సబ్ కమిటీ ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పరిశీలన జరిపి విధి విధానాలను కమిటీ సిఫారసు చేయాల్సి ఉంటుంది.

# కూలిన సుంకిశాల రిటెయినింగ్ వాల్



- నాగార్జున డెడ్ స్టోరేజీ వద్ద నిర్మాణం
- క్షణాల్లో జల దిగ్బంధమైన పంప్‌హౌస్
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- కూలీలకు వరమైన షిఫ్టు మారే సమయం
- అరగంట తేడా జరిగితే భారీ ప్రాణనష్టమే!
- ఆగస్టు 1న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

నాగార్జునసాగర్ వద్ద సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిపోయింది. ఆగస్టు 1న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగలోకి వచ్చింది. కార్మికులు షిఫ్టు మారే సమయంలో ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలి క్షణాల్లో పంప్‌హౌస్ జలదిగ్బంధమైంది. హైదరాబాద్ తాగు నీటి అవసరాల కోసం సుంకిశాల పథకం చేపట్టిన విషయం తెలిసిందే. సొరంగాల్లోకి జలాలు రాకుండా రక్షణగా రిటెయినింగ్ వాల్ నిర్మించారు. రిటెయినింగ్ వాల్ కూలడంతో సుంకిశాల పంపుహౌస్ నీట మునిగింది.

వివరాలు 2వ పేజీలో



## సర్వీసు రోడ్ల ఏర్పాటుకు ప్రతి పాదనలు సిద్ధం చేయండి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు

బలగం టీవి, హైదరాబాద్

%ఖమ్మం : ఖమ్మం–విజయవాడ, నాగపూర్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారికి ఇరువైపులా జిల్లా సరిహద్దుల వరకు రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసేందుకు అసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో అన్నారు.జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల అభివృద్ధిపై అధికారులతో గురువారం తన క్యాంప్ ఆఫీసులో రివ్యూ నిర్వహించారు. జాతీయ రహదారుల నిర్మాణాలు సాగుతున్నందున జిల్లా సరిహద్దుల వరకు సర్వీసు రోడ్డు నిర్మించే విధంగా సమగ్ర నివేదిక వెంటనే సిద్ధం చేసి అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సమర్పిస్తామన్నారు.అదేవిధంగా ధంసలాపురం బోనకల్ రోడ్డు దగ్గర ఎగ్జిట్ మరియు ఎంట్రీ పాయింట్లు మరియు సర్వీస్ రోడ్లు కొరకు ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి అనుమతి వచ్చిందన్నారు. ఖమ్మం పట్టణంలోకి ప్రవేశం కొరకు ధంసలాపురం బోనకల్ రోడ్డు దగ్గర ఎగ్జిట్ మరియు ఎంట్రీ పాయింట్లు మరియు సర్వీస్ రోడ్లు అనుమతి వచ్చిందని..పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైరా నియోజకవర్గంలో పర్యటన ఉన్నందున ఖమ్మం–అశ్వారావుపేట రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని సూచించారు. వైరా బ్రిడ్జి మరమ్మతులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు.

## లోక్‌సభలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు..

- వక్ఫ్ బోర్డులోకి మహిళలు
- వక్ఫ్ ఆస్తి ప్రకటించడానికి ముందు భూమి వెరిఫికేషన్ తప్పనిసరి
- వ్యతిరేకించిన 'ఇండియా' కూటమికి చెందిన పార్టీలు
- వక్ఫ్ బోర్డు చట్టంలో ఉన్న లొసుగులను సరిచేయడం కోసమే ఈ బిల్లు : మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు

వివరాలు 2వ పేజీలో

## ఉన్నమాటంటే ఉలుకెందుకు..?



- పంచాయతీలకు 9 పైసలు కూడా చెల్లించలేదనేది అబద్ధమా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ హయాంలో గ్రామ పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ సైతం కష్టంగా మారిందని మేం చెబుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కి పడుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తాము పదేపదే అబద్ధం చెబుతున్నామని మంత్రి సీతక్క అంటున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం 9వ నెలలోకి అడుగుపెడుతున్నపటికీ గ్రామ పంచాయతీలకు 9 పైసలు కూడా చెల్లించలేదు అనేది అబద్ధమా? అని ప్రశ్నించారు. లేదా కేంద్రం నుండి ఉపాధి హామీ, హెల్త్ మిషన్ వంటి పథకాల కింద వచ్చిన రూ. 2100 కోట్ల నిధులను గ్రామాలకు ఇవ్వకుండా దారి మళ్ళించింది అబద్ధమా? 15 ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ. 500 కోట్ల నిధులను గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా ఆపింది అబద్ధమా? మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల కోసం ఛలో సచివాలయం పిలుపు నిస్తే వారిని పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించింది అబద్ధమా? గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం అటకెక్కడం మేం చెప్పిన అబద్ధమా? గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో డెంగీ, మలేరియా వంటి సీజనల్ రోగాలు ప్రబలడం అబద్ధమా? రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించకపోవడం అబద్ధమా? 8 నెలలుగా జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం అబద్ధమా? బీఆర్ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలకు నెలనెల రూ. 275 కోట్లు, సంవత్సరానికి రూ. 3,300 కోట్ల నిధులు విడుదల చేసింది నిజం కాదా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించకుండా, సమస్యలు పరిష్కరించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం సరికాదు. ఈ ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నది పచ్చి నిజం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతున్నాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# హాకీలో భారత్‌కు కాంస్యం



- బ్రాంజ్ పోరులో 2-1తో స్పెయిన్‌పై గెలుపు
- 52 ఏండ్ల తర్వాత ఒలింపిక్స్ హాకీలో భారత్‌కు వరుసగా రెండుసార్లు కాంస్యం
- పారిస్ ఒలంపిక్స్‌లో 4కు చేరిన భారత్ పతకాల సంఖ్య

బలగం టీవి, పారిస్

పారిస్ ఒలంపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్యం సాధించింది.,గురువారం స్పెయిన్‌తో హోరాహోరీగా సాగిన పోరులో టీమిండియా 2-1తో గెలుపొందింది. ఒకదశలో 1-0తో వెనకబడగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వరుస గోల్స్‌తో ప్రత్యర్థికి భారత జట్టు దడపుట్టించింది. ఆఖర్లో స్పెయిన్ రెండు గోల్ ప్రయత్నాలను అడ్డుకొని టీమిండియా చిరస్మరణీయ విజయంతో కాంస్యాన్ని ముద్దాడింది. ఆఖరి ఒలింపిక్స్ ఆడుతున్న గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్‌కు ఘనమైన వీడ్కోలు పలికింది.

వివరాలు 2వ పేజీలో

## మెరుగైన సేవలందించేందుకే జీఐఎస్ సర్వే



- డ్రోన్, ఇంటింటి సర్వే ద్వారా ఆస్తి పన్ను పెంపు ఉండదు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో జీహెచ్ఎంసీ చేస్తున్న జీఐఎస్ సర్వే ద్వారా ఎలాంటి ఆస్తి పన్ను పెంపు ఉండదని, మెరుగైన సేవలందించేందుకే సర్వే అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి స్పష్టం చేశారు. నగరంలో కేవలం భవనాలు, రహదారులు, ఆస్తుల గుర్తింపునకు మాత్రమే ఈ సర్వే చేస్తున్నట్టు చెప్పారు. దేశానికి మోడల్‌గా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయోగాత్మకంగా ఈ సర్వే చేస్తున్నట్లు వివరించారు. ఈ సర్వే పూర్తయ్యాక ఇంటింటికి డిజిటల్ డోర్ నెంబర్లతోపాటు వంద రకాల సేవలు ఇంటి ముందుకే వస్తాయని వెల్లడించారు.

జీఐఎస్ సర్వే వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆమ్రపాలి తెలిపారు. జీహెచ్ఎంసీలోని 5 సర్కిళ్లలో జులై 30న మొదలుపెట్టిన ఇంటింటి సర్వే ద్వారా ఇప్పటి వరకు 130 చదరపు కిలో మీటర్లు మాత్రమే డ్రోన్ సర్వే జరిగిందని వెల్లడించారు.

డ్రోన్ సర్వేపై ప్రజల్లో అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్న వేళ రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ స్నేహ శబరీశ్‌తో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమ్రపాలి వివరాలను వెల్లడించారు. శాటిలైట్ మ్యాపింగ్‌కు అనుగుణంగా డ్రోన్ల ద్వారా కేవలం నగరంలోని నిర్మాణాలు, భవనాలు, రహదారులు, ఆస్తులను గుర్తించేందుకు మాత్రమే సర్వే చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకోసం యజమానుల నుంచి బలవంతంగా ఎలాంటి ఆధారాలు సేకరించడం లేదని పేర్కొన్నారు. అనధికారిక, అధికార నిర్మాణాల ప్రస్తావన లేకుండా సర్వే చేస్తున్నట్లు వివరించారు.

మిగితా 2వ పేజీలో

## జపాన్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదు
- సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

వివరాలు 4వ పేజీలో

## రెజ్లింగ్ గెలిచింది.. నేను ఓడిపోయా

- కుస్తీకి ఇక గుడ్ బై
- రెజ్లర్ వినేశ్ ఫోగాట్
- ఎక్స్‌లో రిటైర్‌మెంట్ ప్రకటించిన స్టార్ రెజ్లర్

వివరాలు 4వ పేజీలో



## హైదరాబాద్‌లో చార్లెస్ స్క్వాబ్ టెక్నాలజీ సెంటర్

- సంస్థతో సీఎం రేవంత్ ఒప్పందం
- భారత్‌లో సంస్థ నెలకోల్పే మొదటి సెంటర్ ఇదే

బలగం టీవి, హైదరాబాద్

ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్ లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం.

అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్ లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో ఛార్లెస్ స్క్వాబ్ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు డెన్నిస్ హెూవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

# వినేశ్ అనర్హతపై రాజ్యసభలో చర్చ

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు నినాదాలు.. వాకౌట్
- రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ మండిపాటు





**బలగం టీవి, న్యూఢిల్లీ**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు రాజ్యసభను కుదిపేసింది. వినేశ్ ఫొగాట్ అనర్హత వేటు వ్యవహారంపై గురువారం రాజ్యసభలో వాడివేడి చర్చ జరిగింది. ఫొగాట్ అనర్హతపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు నినాదాలు చేశాయి. ఆ తర్వాత వాకౌట్ చేశాయి. ఈ నేపథ్యంలో విపక్ష సభ్యులపై ప్రవర్తనపై రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అసహనం వ్యక్తం చేస్తూ సభ నుంచి వెళ్లిపోయారు.

ముందుకు వినేశ్ న్యాయం జరిగేలా చూడాలంటూ విపక్ష నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. అలాగే వినేష్ అనర్హతపై దారితీసిన పరిస్థితులపై చర్చకు పట్టుబట్టాయి. అందుకు రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అంగీకరించకపోవడం వల్ల విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ క్రమంలో రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ విపక్ష సభ్యుల ప్రవర్తనను తప్పుబట్టారు. "ఈ విషయం గురించి ప్రతిపక్షాలు మాత్రమే బాధపడుతున్నాయని భావిస్తున్నారు. అందరికీ అదే బాధ ఉంటుంది. వినేశ్ ఫొగాట్‌కు జరిగిన అన్యాయం పట్ల యావత్ దేశం బాధలో ఉంది. ప్రతి ఒక్కరూ వినేశ్ ఫొగాట్‌కు అండగా నిలుస్తున్నారు. ఈ విషయాన్ని రాజకీయం చేస్తే ఆమెను అవమానించినట్లే అవుతుంది" అని విపక్ష సభ్యులపై రాజ్యసభ ఛైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. అలాగే టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ తీరును సైతం ఖండించారు. "మీరు రాజ్యసభ ఛైర్మన్‌పై అరుస్తున్నారు. ఈ ప్రవర్తనను ఖండిస్తున్నాను. అలాంటి ప్రవర్తనను ఎవరైనా భరించగలరా?" అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కాసేపు సభ నుంచి రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ బయటకు వెళ్లిపోయారు.

భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు యావత్ దేశం అండగా ఉందని రాజ్యసభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. ఇప్పటికే ప్రధాని వినేశ్‌ను ఛాంపియన్లకే ఛాంపియన్‌గా అభివర్ణించారని పేర్కొన్నారు. 140 కోట్ల దేశ ప్రజల భావన ఇదేనని అన్నారు. దురదృష్టవశాత్తూ ఈ అంశాన్ని సభలో విపక్షం, అధికార పక్షం అన్నట్లు విభజిస్తున్నారని ఆరోపించారు. వినేశ్ ఫొగాట్ అనర్హత వ్యవహారంలో కేంద్రం, క్రీడాశాఖ, భారత ఒలింపిక్ మండలి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని వివరించారు. ప్రతిపక్షం చర్చించడానికి ఏ అంశం లేదని, ఒక వేళ ఉంటే చర్చకు అధికార పార్టీ సిద్ధమని తెలిపారు.

వినేశ్ ఫొగాట్ మళ్లీ తలెత్తుకుని పోరాడాలని దేశం మొత్తం ఆశగా ఉందని కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సూర్జేవాలా తెలిపారు. కానీ కేంద్రం ఎందుకు మౌనంగా ఉంది?.. భారత ఒలింపిక్ సంఘం అంతర్జాతీయ ఒలింపిక్ సంఘంతో మాట్లాడాలని కోరారు. చేజారిన ఆ పతకం వినేశ్ ఒక్కదానిదే కాదు, దేశానిదని పేర్కొన్నారు. వినేశ్‌కు రజతం వచ్చేలా చూసే బాధ్యత కేంద్రానిదేనని అన్నారు.

# మెరుగైన సేవలందించేందుకే జీఐఎస్ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

డ్రోన్, ఇంటింటి సర్వే ద్వారా ఆస్తి పన్ను పెంపు ఉండదని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను పెంపు ప్రభుత్వం తీసుకునే నిర్ణయమని పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్వే నిర్వహించడం వల్ల జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్ మ్యాప్ చేయడానికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు.మొత్తం 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో జరిగే ఈ సర్వేలో కంటోన్మెంట్ లాంటి సెక్యూరిటీ జోన్లకు సంబంధించిన సమాచారం బహిర్గతం కాదని, ప్రజల నుంచి సేకరించిన వివరాలు కూడా అత్యంత భద్రంగా ఉంచుతామని ఆమ్రపాలి తెలిపారు. నగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలతో కలిపి సుమారు 19 లక్షల 43 వేల నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించామని, అందులో కమర్షియల్ గా 2.7 లక్షల గృహాలు ఉన్నట్లు తెలిపారు. సామాన్యుల నివాసాల నుంచి కాకుండా వ్యాపార, వాణిజ్య కేంద్రాల నుంచి వాస్తవ ఆస్తి పన్ను రాబడతామని తెలిపారు.డ్రోన్ సర్వే పూర్తయ్యాక ప్రతి అంశం మ్యాపింగ్ జరుగుతుందని, తద్వారా వీధుల్లో విద్యుత్ దీపాల దగ్గరి నుంచి చెత్త సేకరణ వరకు ప్రతి అంశం జీహెచ్ఎంసీకి సమగ్ర వివరాలు అందుతాయన్నారు. ఆస్తి పన్ను మదింపులోనూ చాలా సులభతరం అవుతుందన్నారు.

ప్రజల నుంచి సేకరించే డేటా రేల్ టేల్ సర్వర్‌లో అత్యంత భద్రంతా ఉంటుందన్నారు. మొదట్లో ఒక్కో ఇంటి వద్ద సర్వే కోసం 40 నుంచి 45 నిమిషాల సమయం పడుతుందని, అందుకోసం సేకరించే వివరాలను తగ్గించామని తెలిపారు. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా డ్రోన్ సర్వే నెమ్మదిగా సాగుతుందని రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ స్నేహ శభరీష్ తెలిపారు. నగరంలో ప్రస్తుతం 90 బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయని, అవసరాన్ని బట్టీ సర్వే బృందాల సంఖ్యను పెంచుతామన్నారు. మొత్తం 600 బృందాలతో రానున్న 6 నెలల్లో జీఐఎస్ సర్వేను పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు.

**ఈ మేరకు రోజువారీ జీవితంలో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్న ఆమ్రపాలి తాను నివాసం ఉండే కుందన్ బాగ్ లో చెత్త సేకరణ సరిగా చేయడం లేదని, ఆ విషయం ఈ సర్వే అనంతరం ఎప్పటికప్పుడు తెలిసిపోతుందన్నారు. అలాగే ఇంటింటికి ప్రత్యేకంగా డిజిటల్ డోర్ నెంబర్ ఇస్తామని, దానిపై ఉన్న క్యూఆర్ కోడ్ వల్ల ఆ ఇంటికి లేదా వీధిలో ఎలాంటి సేవలందాయనే విషయాలు క్షణాల్లో తెలిసిపోతాయన్నారు.**

# బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత

**బలగం టీవి, హైదరాబాద్**



పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, సీపీఐ(ఎం) సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య (80) కన్నుమూశారు. దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్న కోల్‌కతాలో గురువారం తుదిశ్వాస విడిచారు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం వెల్లడించారు. 2000 నుంచి 2011 వరకు వరుసగా 11 ఏండ్లపాటు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన సేవలందించారు. 1944, మార్చి 1న భట్టాచార్య ఉత్తర కోల్‌కతాలో జన్మించారు. 1966లో సీపీఐ(ఎం) ప్రాథమిక సభ్యుడయ్యారు. 1971లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 1982లో కార్యదర్శివర్గ సభ్యుడిగా.. 1984 నుంచి పార్టీ కేంద్ర కమిటీకి అతిథిగా ఉన్నారు. 1977లో తొలిసారి కాశిపుర్-బెల్గాచియా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1987లో ఓడిపోయినా అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. 1996-99 వరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖను నిర్వహించాడు. అంచలంచెలుగా తన వృత్తి జీవితంలో ఎదిగిన బుద్ధదేవ్.. జ్యోతి బసు ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2001, 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఆయన అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. వీరికి భార్య మీరా. కూతురు సుచేతన ఉన్నారు.ఐదు దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగి 18 ఏండ్లు మంత్రిగా, 11 ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయనకు సొంత బంగ్లా, కారు లేదు. ఆయన తన జీతాన్ని కూడా పార్టీ ఫండ్‌కి అందజేసేవారు. బుద్ధదేవ్ భట్టాచార్య మంత్రిగా, సీఎంగా ఉన్నప్పుడు కూడా ఆయన కుటుంబసభ్యులు ప్రజారవాణాలో మాత్రమే ప్రయాణించేవారు.

# లోక్‌సభలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు..

- విపక్షాల అభ్యంతరం..

**బలగం టీవి, న్యూఢిల్లీ**



కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్ సభలో వక్ఫ్(సవరణ) బిల్లును నిరసనల మధ్య ప్రవేశపెట్టింది. ఈ బిల్లు 1995 చట్టంలో గణనీయమైన మార్పులకు తావిచ్చింది. వక్ఫ్ బోర్డులో మహిళలను చేర్చింది. వక్ఫ్ ఆస్తి ప్రకటించడానికి ముందు భూమి వెరిఫికేషన్ తప్పనిసరి చేసింది. కాగా ముస్లిం పర్సనల్ లా బోర్డ్(ఏఐఎంపిఎల్‌బి) దీనిని సమ్మతించబోమని ప్రకటించింది. 'ఇండియా' కూటమికి చెందిన పార్టీలు కూడా వక్ఫ్ చట్టంలో మార్పులను వ్యతిరేకించాయి.

**నిరసనల మధ్యే బిల్లు**

ఇండియా కూటమి పక్షాల నిరసన మధ్య కేంద్రప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును లోక్‌సభలో మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ముస్లిం సమాజం మెచ్చుకునేదిగా ఉందన్నారు. వక్ఫ్ బోర్డు చట్టంలో ఉన్న లొసుగులను సరిచేయడం కోసమే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని సరిగ్గా రూపొందించలేదన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఏ అధికరణకు వ్యతిరేకంగా లేదన్నారు. రాజకీయ కారణాలతో బిల్లు తీసుకొచ్చారని విపక్షాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో న్యాయం అందిరకీ ఒకేలా ఉండాలన్నారు. మతాలవారీ న్యాయం ఉండదన్నారు. ఈ బిల్లు ద్వారా ఎవరి హక్కులను హరించడంలేదని, ముస్లిం సమాజంలో అందరికీ హక్కులు కల్పించే ఉద్దేశంతో ఈ సవరణ బిల్లు తీసుకొస్తున్నామన్నారు. బిల్లుపై సంప్రదింపులు చేయకుండా.. ఏకపక్షంగా తీసుకొచ్చారని విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. 2014 తర్వాత వక్ఫ్ బోర్డు చట్టంపై ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించామని, ఎంతోమంది ప్రజలతో మాట్లాడి.. వారి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత మాత్రమే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు. అనేకమంది ముస్లిం పెద్దలు, ముస్లిం సంస్థలను కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా బిల్లు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా ప్రజల అభిప్రాయాలు స్వీకరించామన్నారు. ఎవరిని సంప్రదించకుండా బిల్లు తీసుకొచ్చామనడం సరికాదన్నారు.

వక్ఫ్‌బోర్డుల పేరుతో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని ఎందరో ముస్లింలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. మాఫియా నాయకత్వంలో వక్ఫ్‌బోర్డులు నడుస్తున్నాయని చెప్పారని, వాళ్లపేర్లు తాను సభలో చెప్పడం సమంజసం కాదన్నారు. ఎందరో సామాన్య ప్రజలతో మాట్లాడిన తర్వాత వక్ఫ్‌బోర్డు చట్టంలో సవరణలు తేవాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఢిల్లీ, పాట్నా, లక్నో, జమ్ము-కశ్మీర్‌లో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. ఏపీ, అస్సాం, బీహార్, ఢిల్లీ, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ, కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఉత్తంప్రదేశ్.. ఇలా అన్ని రాష్ట్రాల నుంచి ముస్లిం సంస్థల ప్రతినిధులు వచ్చి వక్ఫ్‌బోర్డులో అక్రమాలు, అవకతవకలపై ఫిర్యాదులు చేశారని, వక్ఫ్‌బోర్డును కాపాడటంతో పాటు ఇప్పటివరకు అవకాశాలు పొందని ముస్లిం సమాజం అవకాశాలు పొందే విధంగా సవరణలు తీసుకొస్తున్నట్లు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. వక్ఫ్‌బోర్డు చట్టంలో సవరణలు తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉందని.. ఈ విషయంలో విపక్షాలు రాజకీయం చేయవద్దని కిరణ్ రిజిజు కోరారు. ఈబిల్లును వ్యతిరేకించే వ్యక్తులను ముస్లిం సమాజం క్షమించదన్నారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే వ్యక్తులను సామాన్య ముస్లింలు ఎప్పటికీ గుర్తించుకుంటారని తెలిపారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం కొన్ని పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించడం సరికాదన్నారు. ప్రతి సభ్యుడు ఈ బిల్లుకు మద్దతు తెలిపాలని కిరణ్ రిజిజు కోరారు.

# సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు లభించాయి. అదనపు డీజీలుగా ఉన్న ఐదుగురు అధికారులను డీజీపీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డితోపాటు అభిలాష బిస్త్, సౌమ్య మిశ్రా, షికా గోయల్‌ను డీజీపీలుగా ప్రమోట్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, సీఐడీ చీఫ్ షికా గోయల్ పనిచేస్తున్నారు. వారు అవే స్థానాల్లో కొనసాగుతారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# జావెలిన్ త్రోలో నీరజ్‌కు సిల్వర్

**బలగం టీవి, పారీస్**



గత ఒలింపిక్స్ లో బంగారు పతకాలు విజేత నీరజ్ కు ఈ ఒలింపిక్స్ లో సిల్వర్ మెడల్ లభించింది. జావిలిన్ త్రో విభాగం లో జరిగిన ఫైనల్స్ లో పాక్‌కు చెందిన నదీంకు బంగారు పతకం రాగా నీరజ్ రెండో స్థానానికి పరిమితమై రజతం గెలుచు కున్నాడుఅర్షద్ నదీమ్ పురుషుల జావెలిన్ త్రోలో 92.97 మీటర్ల విసిరి కొత్త రికార్డు సృష్టించాడు. ఇక నీరజ్ 89. 45 మీటర్లు మాత్రమే విసిరి సెకండ్ ప్లేస్ కు పరిమితమయ్యాడు దీంతో సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. కాంస్య పతకం అండర్సన్ పీటర్స్‌కు లభించింది.

# హాకీలో భారత్‌కు కాంస్యం

**బలగం టీవి, పారీస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో కాంస్య పతకం చేరింది.స్పెయిన్‌తో జరిగిన పోరులో 2-1తేడాతో గెలిచింది. ఈ విజయంతో భారత్ ఖాతాలో నాలుగు కాంస్య పతకాలు వచ్చి చేరాయి. భారత హాకీ జట్టు కాంస్యం మ్యాచ్‌లో చెలరేగింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గురి తప్పకుండా గోల్ కొట్టగా.. డిఫెన్స్ బృందం ప్రత్యర్థి ఆటగాళ్ల ఎత్తులను చిత్తు చేసింది. ఇక.. వాల్ శ్రీజేష్ ఎప్పటిలానే బంతిని అడ్డుకొని టీమిండియా విజయంలో భాగమయ్యాడు. సుదీర్ఘ కెరీర్‌ను ఒలింపిక్ విజేతగా ముగించాడు.

తొలి అర్ధ భాగంలో స్పెయిన్ ఆటగాడు మార్క్ మిరల్లెస్ పెనాల్టీ కార్నర్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపి ఇండియాను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే.. కాసేపట్లో తొలి అర్ధ భాగం ముగుస్తుందనగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. అంతే.. 1-1తో స్కోర్ సమం అయింది.

అనంతరం రెండో అర్ధభాగం మొదలవ్వగానే భారత సారథి మళ్లీ పెనాల్టీ కార్నర్‌ను స్పెయిన్ గోల్ కీపర్ కళ్లుగప్పి గోల్స్ కొట్టాడు. దాంతో, భారత జట్టు 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత భారత డిఫెండర్లు స్పెయిన్ ఫార్వర్డ్‌ను సమర్థంగా నిలువరించారు. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా స్పెయిన్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. కానీ, భారత వాల్ శ్రీజేష్ అద

# అడవులను నరికే వారిగా నటిస్తున్న ఇప్పటి హీరోలు...

- ఏపీ డిప్యూటీ సీఎం, సినీనటుడు పవన్ కళ్యాణ్
- ఏపీకి 8 కుంకీ ఏనుగులు ఇచ్చేందుకు అంగీకరించిన కర్ణాటక ప్రభుత్వం

**బలగం టీవి, బెంగళూరు**

ఒకప్పటి హీరోలు అడవులను కాపాడేవారిగా నటించి మెప్పిస్తే ఇప్పటి హీరోలు ఆ అడవులను నరికే వారిగా నటిస్తున్నారంటూ ఏపీ డిప్యూటీ సీఎం, సినీనటుడు పవన్ కళ్యాణ్ అన్నారు. బెంగుళూరు పర్యటనలో ఉన్న ఆయన నేడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారు..అనంతరం ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి ఖండ్రే భేటి అయ్యారు.. దీనికి ముందు అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం వస్తున్న సినిమాల్లో అడవులను నరికివేస్తున్నారని అన్నారు. ఆయన మాట్లాడుతూ "నాకు చాలా నచ్చింది ఏంటి అంటే దివంగత కన్నడ నటుడు రాజ్ కుమార్ నటించిన చిత్రం గంధడ గుడి. ఈ సినిమా థీమ్ ఏంటి అంటే అడవులను కాపాడడం. నాకు కూడా ఇలాంటి సినిమాల్లో నటించాలా అనిపించేది. ఇంతకుముందు సినిమాల్లో హీరోలు అడవులని కాపాడేవారు. కానీ ఈరోజుల్లో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం హీరోయిజం అయిపోయింది. నేను ఆ పరిశ్రమలో ఉన్నానని అప్పుడప్పుడు బాధగా అనిపిస్తుంటుంది. ఇలాంటివి తగ్గి మళ్లీ అడవుల ప్రాముఖ్యత తెలిసేలా సినిమాలు రావాలి" అని అన్నారు.



– %ూాంజవతీఅంవవవత్ –

ఆ తర్వాత . కర్ణాటక అటవీ శాఖ మంత్రితో పవన్ కళ్యాణ్ సమావేశం అయ్యారు. ఎర్రచందనం అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పవన్ చర్చలు జరిపారు. పొరుగు రాష్ట్రాల సహకారంతో ఎర్ర చందనం దోపిడీని అరికట్టేలా ఎర్ర చందనం స్మగ్లింగ్ కట్టడి కలిసి పని చేయాలని అటవీ శాఖ మంత్రిని కోరారు. అలాగే ఏపీలో ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు ఇక్కడ ట్రైన్డ్ ఏనుగులను పంపాలని పవన్ కోరారు

మొత్తం ఏడు అంశాలపై చర్చించినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఏనుగుల సమస్య పరిష్కరించేందుకు 8 కుంకి ఏనుగులను ఏపీకి ఇచ్చేందుకు కర్ణాటక ఒప్పుకోవడం సంతోషమని పేర్కొన్నారు.అటవీ సంపద రక్షణకు ఐటీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఎర్రచంద్రనం అక్రమ రవాణాను అరికట్టాలని, వన్యప్రాణుల స్మగ్లింగ్ చేసే వారిని కట్టడి చేయాలని నిర్ణయించామని తెలిపారు. సుమారు రూ. 140 కోట్ల విలువ గల ఎర్రచందనాన్ని పట్టుకున్న కర్ణాటక అటవీ అధికారులను అభినందించారు. శ్రీశైలం , తిరుపతి క్షేత్రాలకు వచ్చే కర్ణాటక భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. సమావేశం అనంతరం పవన్ కల్యాణ్‌ను కర్నాటన మంత్రి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

# కూలిన సుంకిశాల రిటెయినింగ్ వాల్

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌కు కృష్ణాజలాల తరలింపు కోసం చేపట్టిన సుంకిశాల పథకంలో పెను ప్రమాదం తప్పింది. పథకంలో భాగంగా సొరంగాల్లోకి సాగర్ జలాలు రాకుండా ఉండేందుకు రక్షణగా నిర్మించిన కాంక్రీట్ గోడ (రిటెయినింగ్ వాల్) ఒక్కసారిగా కుప్పకూలడంతో సుంకిశాల పంపుహౌస్ నీట మునిగింది. నిత్యం వందమందికిపైగా కూలీలు పని చేసే ఆ ప్రదేశం కండ్ల ముందే క్షణాల్లో జలదిగ్బంధమైంది. ఇక్కడ మూడు షిఫ్టుల్లో వందల మంది కూలీలు పనిచేస్తుంటారు.

సరిగ్గా కూలీలు షిఫ్టు మారే సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఈ నెల ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అర గంట ముందు అర గంట తర్వాతగానీ ఈ ప్రమాదం జరిగి ఉంటే భారీగా ప్రాణ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చేదని ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. నాగార్జునసాగర్‌కు లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటం, నీటిమట్టం కూడా భారీగా ఉన్న సమయంలో రక్షణ గోడ వెనక గేటును ఏర్పాటు చేసి సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

సాగర్‌లో నీటిమట్టం భారీగా తగ్గిన తర్వాతగానీ సుంకిశాల పనులు మొదలయ్యేలా లేవు. ఎండకాలం వరకు పనులు చేపట్టే అవకాశం లేదని స్పష్టమవుతున్నది.

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం జలమండలి రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల కృష్ణాజలాలను తరలిస్తున్నది. ఇందుకోసం నాగార్జునసాగర్ నుంచి జలాలను ఏఎమ్మార్పీ ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి కోదండాపూర్ వద్ద నిర్మించిన నీటిశుద్ధి కేంద్రంలో శుద్ధి చేసిన తర్వాత పైప్‌లైన్ల ద్వారా నగరానికి తరలిస్తారు. అయితే నాగార్జునసాగర్‌లో కనీసంగా 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఏఎమ్మార్పీ మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. అందుకే తరచూ వేసవిలో అత్యవసర మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సిన పరిస్థితి.

ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ జలాశయ డెడ్‌స్టోరేజీ సుమారు 492 అడుగుల నీటిమట్టం నుంచి కూడా జలాలను తరలించేందుకు వీలుగా సుంకిశాల పథకాన్ని చేపట్టారు. వాస్తవానికి ఇది 1980 దశకంలో రూపొందించిన పథకం కాగా.. స్థానిక రైతుల ఆందోళనలతో పక్కకుపెట్టారు. 2001-03లో చంద్రబాబు హయాంలో సుంకిశాల పథకాన్ని పక్కనపెట్టి, ఏఎమ్మార్పీ ద్వారా నగరానికి కృష్ణాజలాల తరలింపు పథకం మొదటి దశ పనులను పూర్తి చేశారు. అనంతరం కాలక్రమేణా మరో రెండు దశలు పూర్తయినా%ోా% సుంకిశాల పట్టాలెక్కలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2,215 కోట్లతో ఈ పథకం పనులు మొదలయ్యాయి.

నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి సొరంగ మార్గం ద్వారా సుంకిశాల వద్ద నిర్మించిన పంపుహౌజ్ వరకు నీటిని తరలించి, అక్కడ మోటర్లతో లిఫ్టు చేసి, పైప్‌లైన్ల ద్వారా కోదండాపూర్ వరకు జలాలను తరలించడమనేది ఈ పథకం స్వరూపం. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ఆధారంగా తెరిచేందుకుగాను మూడు స్థాయిల్లో (ఒక్కో లెవల్‌లో ఒక్కోటి చొప్పున) మూడు సొరంగ మార్గాలను నిర్మించారు. అయితే మొత్తం పథకం పనులు పూర్తయి, మోటర్లను బిగించిన తర్వాత సొరంగాలను వంద శాతం పూర్తి చేస్తారు. అప్పటివరకు నాగార్జునసాగర్ వైపు కొంతమేర తవ్వకుండా వదిలివేస్తారు. తద్వారా సాగర్‌లోని నీళ్లు సొరంగంలోకి రాకుండా ఉంటాయి. అదేవిధంగా సొరంగాల ద్వారా పంపుహౌజ్‌లోకి నీళ్లు వచ్చే ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యగా భారీస్థాయి రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) నిర్మించారు. ఇప్పటికే పథకంలో భాగంగా సుంకిశాల నుంచి కోదండాపూర్ వరకు పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.


**కుప్పకూలిన గోడ**

పంపుహౌజ్‌లో ప్రస్తుతం మోటర్ల బిగింపునకు సంబంధించిన సివిల్ పనులు జరుగుతున్నట్టు తెలిసింది. ఇందుకోసం పంపుహౌజ్‌లో వందమందికిపైగా కార్మికులు పని చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో ఈ సంఖ్యలోనే కార్మికులు ఉంటారు. ఉదయం ఆరు గంటలకు పనిలోకి వచ్చిన వారు సాయంత్రం ఆరు గంటలకు, అప్పుడు పనిలోకి వచ్చిన వారు మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు పని నుంచి వెళ్లిపోతారు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు వందమందికిపైగా కార్మికులు షిఫ్టు ముగించుకొని పంపుహౌజ్ నుంచి వాహనంలో బయటికి వస్తున్నారు.వారు పంపుహౌజ్ నుంచి బయటికి వచ్చిన సమయంలోనే పెద్ద పెద్ద శబ్దాలతో ఒక్కసారిగా రక్షణ గోడ కుప్పకూలిపోయింది.

# సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్**



మేడిగడ్డ ప్రాజెక్టుతో పాటు సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దేనని ఉప: ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆ నెపం వేరొకరి మీద వేయడం దారుణమని మండిపడ్డారు.బీఆర్ఎస్ హయాం నాటి ప్రాజెక్టు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. నాసిరకమైన కట్టడం, డిజైన్ లోపం కారణంగానే 2021లో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందని తెలిపారు.కూలే గోడలు కట్టించి మరొకరిపై బురద జల్లేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు .

తమ తప్పిదాలు, పాపాలను మరొకరిపై రుద్దేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. 2021లో చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు గోడ కూలిందని, సాగర్‌లో నీళ్లు వచ్చినందునే గోడ కూలిందని ఆరోపిస్తున్నారని భట్టి తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే సుంకిశాల ప్రాజెక్టు చేపట్టారని విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో వర్షాల దృష్ట్యా చేప్టటాల్సిన చర్యలపై డిప్యూటీ సీఎం : సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "సుంకిశాల ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలోనే చేపట్టారు. సాగర్‌లో నీళ్లు వచ్చినందునే గోడ కూలిందని ఆరోపిస్తున్నారు. నీళ్ల కోసమే కదా సాగర్ కట్టింది. గత ప్రభుత్వ ప్రాజెక్టు డిజైన్లు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో దీని ద్వారా అర్థమవుతోంది. మీ(బీఆర్ఎస్) కట్టడాలు, మీ పాలన ఏ రకంగా ఉందో స్పష్టంగా అర్థమవుతోంది. సుంకిశాల ప్రాజెక్టు మేం కట్టింది కాదు, మా హయాంలో చేపట్టిన ప్రాజెక్టు కాదు. మేడిగడ్డతో పాటు సుంకిశాల పాపం మీ(బీఆర్ఎస్)కే చెందుతుంది" అని అన్నారు.

.తెలంగాణలో పెట్టుబడులకు కార్పొరేట్ పరిశ్రమలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదుగుతోందన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కాం –నికి వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు తెలపాలని భట్టి సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించామని గుర్తు చేశారు. కంట్రోల్ రూమ్ ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తుందని చెప్పారు. మరోవైపు, పదోన్నతుల విషయంలో ఉద్యోగులతో చర్చించాలని ఆదేశించామని డిప్యూటీ సీఎం తెలిపారు.

# రూ.2 లక్షల రుణమాఫీ చరిత్రలో నిలిచిపోతుంది

- అప్పుల్లో ఉన్నా..
  సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం..
- దివ్యాంగులకు అన్ని విధాలుగా
  ప్రభుత్వం అండగా ఉంటుంది..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , చందుర్తి:**
కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పక్షపాతి అని, రైతులు పంటసాయం కోసం తీసుకున్న రుణాలను రెండు లక్షల వరకు మాఫీ చేస్తున్నదని, రెండు లక్షల రుణమాఫీ దేశ చరిత్రలో నిలిచిపోతోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. గురువారం చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగులకు ఉపకరణాలు సహాయ పరికరాలు ఎంపిక శిబిరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ చేయుటకు గత మూడు రోజులుగా ఎంపిక కార్యక్రమాలు నిర్వహించాడం జరుగుతుంది అని అన్నారు.జిల్లా పరిధిలో శనివారం వరకు వివిధ వేదికలలో క్యాంపులు జరుగుతాయని, అర్హులైన వారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటడ్ ట్రై సైకిళు ,,చేతి కర్రలు, చంక కర్రలు వీల్ చైర్లు, మూడు చక్రాల సైకిల్లు, రోలెటర్స్, వినికిడి యంత్రాలు స్మార్ట్ ఫోన్లు ఇలా అనేక రకాలుగా వారికి పంపిణీ చేయడం జరుగుతుంది అని అన్నారు. దివ్యాంగులకు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు పూర్తి సబ్సిడీతో 50 వేల నుండి 1 లక్ష వరకు ప్రభుత్వం సహాయం చేస్తుందని అన్నారు.ఈ క్యాంపులు మూడు నెలలు క్రితం రావాలి కానీ ఎన్నికల కోడ్ వల్ల కొంతఆలస్యమైంది అని అన్నారు.జిల్లాలో దివ్యాంగులకు 9వేల పైచిలుకుపెన్షన్లు వస్తున్నాయని,మరి కొంతమంది దివ్యాంగులకు పెన్షన్లు రావాల్సి ఉంది అని,త్వరలోనే ప్రతి ఒక్కరికి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ నెల లో సిరిసిల్ల లో తేది 8 న కంటిచూపుకు,తేది 21 న వినికిడికి,తేది 23 న అర్థో, తేది 28 న మానసిక వికలాంగులకు సదరం క్యాంపు నిర్వహించబడుతుందని అన్నారు. గతంలో సదరం క్యాంపు మీ సేవలో దరఖాస్తు చేసుకోవడానికి నెలకు ఒకసారి అవకాశం ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు అని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదరన్ సైట్ మీ సేవలో ఎప్పుడు ఓపెన్ ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారని అన్నారు.ప్రస్తుతం జిల్లా పరిధిలో నమోదైన 16 వేల పైగా మంది దివ్యాంగులకు అన్ని ఉపకరణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని,ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి అర్హులైను గుర్తించాలనీ అన్నారు.

దివ్యాంగులకు ఒక భరోసా కల్పించాలని ఈ కార్యక్రమానికి రావడం జరిగింది అని,ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది అని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చెప్పిన విధంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు.రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేశామని, గతంలో మన్మోహన్ సింగ్ ప్రధాని ఉన్నపడు ఏకకాలంలో రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. సాంకేతిక పరంగా కొంత మందికిరుణమాఫీ కాలేదు అని,అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తాం అని అన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**
సీజనల్ వ్యాధుల నియంత్రణ పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. స్వచ్ఛదానం. పచ్చదనంలో భాగంగా నాలుగో రోజు ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్ లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల బాధ్యులు, ఆశాలు, పాఠశాల సమావేశాల్లో డెంగ్యూ, మలేరియాపై అవగాహన కల్పించాలని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. ఏదైనా ప్రాంతంలో జ్వరాలు బయటపడితే ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీలార్వాల్, ఫాగింగ్ చర్యలు అట్టి ఏరియాలో చేపట్టాలని, దోమలను నిరోధించే ఆయిల్ బాల్ తగినంత సంఖ్యలో తయారుచేసుకొని, వాటిని నీరు నిల్వ ప్రదేశాల్లో విడుదల చేయాలని వివరించారు. యాంటీ-లార్వా రసాయనాలు పిచికారీ చేయాలని, ఫాగింగ్ (మలాథియాన్) ప్రతిరోజూ చేయాలని సూచించారు. పట్టణ, స్థానిక సంస్థలలో జంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ వారి సమన్వయంతో వీధి కుక్కల సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ రాం చందర్, వైద్య, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ధరణి దరఖాస్తులు పెండింగ్లో పెట్టవద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ రాం చందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ



**బలగం టీవీ ,తంగళ్లపల్లి**
నాలుగో రోజు స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు భగవద్గీత, హనుమాన్ చాలీసా అందజేశారు.విద్యార్థులకు చదువుతోపాటు ఆధ్యాత్మిక భావాలు పెంపొందించే దిశగా ఎదగాలని భక్తి పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండేపల్లి మాజీ సర్పంచ్ గణప శివ జ్యోతి మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న లింగం. మాజీ ఉపసర్పంచ్ ధర్మ రెడ్డి నాగరాజు, కాంగ్రెస్ మహిళ మండల అధ్యక్షురాలు హారిక రెడ్డి ,ఉపాధ్యాయులు, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఆర్టీసీ డ్రైవర్‌పైకి పాము విసిరిన మహిళ..!

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**
హైదరాబాద్‌లో వింత ఘటన చోటు చేసుకున్నది. ఆర్టీసీ డ్రైవర్‌పైకి ఓ మహిళ పామును విసిరింది. వివరాల్లోకి వెళ్లితే.. నగర పరిధిలోని నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యానగర్ వద్ద మద్యం మత్తులో ఓ మహిళ ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించింది. అయితే, బస్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో ఆగ్రహంతో సదరు మహిళ బస్‌పైకి బీరు బాటిల్‌ని విసిరింది. దాంతో బస్సు వెనుక భాగంలో అద్దం ధ్వంసమైంది. దీంతో బస్సును ఆపి మహిళను పట్టుకునేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. అయితే, ఆ మహిళ ఆగ్రహంతో బస్ డ్రైవర్ పైకి తన వద్ద ఉన్న పామును విసిరింది. దాంతో భయంతో అక్కడి నుంచి డ్రైవర్ పారిపోయాడు. ఆ తర్వాత డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు మహిళను అదుపులోకి తీసుకున్నారు. అయితే, మహిళ వద్ద పాము ఎక్కడిది అనేది తెలియరాలేదు. మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# బాధిత మహిళలకు సత్వర సేవలు అందించాలి...



- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**
లైంగిక దాడులకు గురైన బాధితులకు సత్వర సేవలు అందించాల్సిన బాధ్యత భరోసా కేంద్రం పై ఉందని,లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పిండంతో పాటు వారికి పూర్తి సహయ సహకారాలను అందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.గురువారం సిరిసిల్ల పట్టణ కేద్రంలోని భరోసా సెంటర్ ని ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా పోక్సో, లైంగికదాడి కేసులు జరగగానే సంబంధిత బాధితులను నేరుగా భరోసా సెంటర్ కు సంబంధిత అధికారులు తీసుకొని రాగానే చట్ట ప్రకారం వారికి అందించవలసిన సూచనలు సలహాలు తక్షణమే అందించాలని అన్నారు. పోక్సో, లైంగికదాడి కేసుల్లో బాధితులకు త్వరగా కాంపెన్సేషన్ ఇప్పించడానికి వివిధ డిపార్ట్మెంట్ అధికారులు సిబ్బంది కృషి చేయాలని అన్నారు.

భరోసా సెంటర్ సేవల గురించి జిల్లాలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించలని భరోసా సెంటర్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ కృష్ణ, డిసిర్బీ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ జ్యోతి, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శిల్ప, లీగల్ సపోర్ట్ పర్సన్ అనంత, సపోర్ట్ పర్సన్ స్వభావతి, మల్లీశ్వరి, ఏఎన్ఎం పవణిత తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో టీ తాగుతూ సరదాగా గడిపిన ప్రభుత్వ విప్



**బలగం టీవీ ,రుద్రంగి:**
ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రుద్రంగి మండల కేంద్రంలో ఓ హోటల్లో దినపత్రిక చదువుతు టీ తాగి కాసేపు సరదాగా గడిపారు. నియోజకవర్గంలోని కథలాపూర్ మండలంలో పలు ప్రారంభోత్సవాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో తన స్వగ్రామైన రుద్రంగిలోనీ హోటల్లో పత్రిక విలేకరుల, ప్రజలు, కార్యకర్తలతో కలిసి తేనేటిని స్వీకరించారు. ఈ సందర్భంగా రుద్రంగి అభివృద్ధి పై చర్చించారు.

## ఆప్యాయంగా చిన్నారులతో ఆది



**బలగం టీవీ ,చందుర్తి**
చందుర్తి మండల కేంద్రంలో పర్యటనలో భాగంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.. అనంతరం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో పాల్గొని చిన్నారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా అన్నప్రాసన చేసారు..



## గచ్చిబౌలిలో ట్రాఫిక్ ఆంక్షలు

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**
ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకుగచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయమార్గాల్లో వెళ్లాలని కోరారు.బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి ఐఐఐటి జంక్షన్ వైపు వెళ్లే వాహనాలు బిచ్చారెడ్డి స్వీట్స్(టెలీకాం నగర్) నుంచి గచ్చిబౌలి జంక్షన్ నుంచి ఐఐఐటి జంక్షన్ వైపు వెళ్లాలి. ఐఐఐటి జంక్షన్ నుంచి బయోడైవర్సిటీ జంక్షన్ బైపాస్ ఫ్లైఓవర్ నుంచి

# నాగంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**బలగం టీవీ, గంభీరావుపేట**
గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ,గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలు సీఎంఆర్ఎఫ్ నిధుల కోసం దరఖాస్తు చేసుకుంటే అట్టి సీఎం ఫండ్స్ ను దోచుకున్న పాలన టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని దని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి హమీద్ , జిల్లా ఉపాధ్యక్షులు కొమురిశెట్టి తిరుపతి , ప్రధాన కార్యదర్శి మూల రాంచెంద్రారెడ్డి, బీసీ అధికార ప్రతినిధి పర్శహా న్మండ్ల , నాగంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్, మాజి ఎంపిటిసి పర్శరాములు,నాగభూషణం, మాజి సర్పంచ్చులు అక్కపెల్లి బాలయ్య, భూమ రాజం, నాయకులు గౌరీ శంకర్,పిట్ల వెంకన్న, జంగం రాజులు బంగ్లా రాజు గౌడ్, దేశెట్టి రాజశేఖర్ కొక్కురాజం గణేష్ మరియు తదీతరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తోంది

- తోట ఆగయ్య
  ఒక వ్యక్తి కాదు ఒక శక్తి
- బోర్ వెల్ తిరుపతి
  పద్ధతి మార్చుకో..
- బీఆర్ఎస్ జిల్లా సీనియర్
  నాయకులు అందే సుభాష్




**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**
రాష్ట్రంలో 8 నెలల నుండి రాక్షస పాలన కొనసాగుతున్నదని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు అంది సుభాష్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభాష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య పై కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యల ను చేయడానికి పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు.రాజకీయ పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు ఆగయ్య మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని,తోట ఆగయ్య ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని, ఆగయ్య మీద మాట్లాడిన మాటలను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు.తోట ఆగయ్య విప్లవ పార్టీల నుండి వచ్చిన వ్యక్తి అని, ఉద్యమ పార్టీలో చేరి సముచిత స్థానంలో ఉన్నారని,అలాంటి వ్యక్తిని పట్టుకొని ఇష్టం వచ్చిన రీతిన మాట్లాడడం సబబు కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో 14 సంవత్సరాలు ఉద్యమం చేసిన వ్యక్తి ఆగయా అని,ఆగయ్యకు ఒక చరిత్ర ఉంది అని,చరిత్ర లేని వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోకుంటే తరిమి కొట్టడం జరుగుతుందని అన్నారు.రాజకీయ పరిజ్ఞానం లేని ఓ వ్యక్తి గంభీరావుపేటలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడరని, బోర్లు వేసి రైతులను మోసం చేస్తూ రైతుల రక్తం తాగిన వ్యక్తి తిరుపతి అని,పేకాటలో దొరికిన చరిత్ర బోర్ల తిరుపతిది అని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్దదైన ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ అని, రాజకీయంలో గెలుపోటములు సహజమని,ప్రజలు పరిపా లించే అవకాశం మీకు ఇచ్చారు అని,ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ఉండి కొట్లాడుతామని పేర్కొన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజల మధ్య ఉంటూ,ప్రజల కొరకు కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నరసిం హారెడ్డి, పాశం దేవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు నమిలికొండ శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి వెంకట నరసింహ రెడ్డి, సీనియర్ నాయకులు మీసం రాజం, ఎనగందుల నర్సింలు, హసన్ భాయ్, భూక్య సత్య నాయక్, ఎడ్ల లక్ష్మణ్, గౌస్, ధర్వేష్, నమిలికొండ నర్సిం లు, సంపూర్ శంకర్, చందనం శివరామకృష్ణ, ప్రమోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మీ బిడ్డగా ఉంటూ మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



- ప్రభుత్వ విప్,వేములవాడ
  ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ :**
మీ బిడ్డగా ఉంటూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ రూరల్ మండలం ఫాజల్ నగర్ గ్రామంలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ సమక్షంలో సుమారు 200 కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పట్ల ఆకర్షితులై ముదిరాజ్, రజక,కుర్మా,రెడ్డి సంఘ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు అని అన్నారు.ప్రజల కష్టా సుఖల్లో పలు పంచుకొంటూ, ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా కార్యకర్తలు పనిచేయాలని,ప్రజలకు ప్రభుత్వనికి మధ్య వారధిగా ఉండాలి అని అన్నారు.

ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినామని, ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేసామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసుకుంటూ ముందుకు పోతున్నామని అన్నారు.కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి మాకు అండగా నిలబడడానికి,నేడు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకుతున్నామని అన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఫాజుల్ నగర్ ప్రాజెక్టు పూర్తయిందని,నేడు కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పలు అభివృద్ధి ఫలాలు అందుతాయని పలువురు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు అని,మీ విశ్వాసాన్ని వమ్ము చేయకుండా మన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుంది అని అన్నారు.



# జపాన్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదు
- సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

**బలగం టీవీ, టోక్యో**

జపాన్‌లో గురువారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.1 తీవ్రతతో భూకంపం నమోదైంది. 25 కి.మీ.ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. నైరుతి దీవులైన క్యుషు, షికోకోను ఇది వణికించింది. దీని ధాటికి పెద్ద పెద్ద భవనాలు కంపించిపోయాయి. దీంతో అక్కడి ప్రభుత్వం ఆ దేశంలోని నైరుతి ప్రాంతానికి సునామీ హెచ్చిరికలు జారీ చేసింది. ఒక్కసారిగా ప్రజలు భయాందోళన చెందారు. ఇళ్లు, ఆఫీసుల నుంచి బయటకు పరుగులు తీశారు. భారీ భూకంపం సంభవించడంతో జపాన్‌లోని నైరుతి ప్రాంతంతోపాటు వివిధ పట్టణాలు, గ్రామాలకు అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మియాజాకి, కగోషిమా, ఎహిమ్ ప్రిఫెక్చర్, కొచ్చి, ఓయిటా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మియాజాకి ప్రిఫెక్చర్‌లో 20 సెంటీమీటర్ల ఎత్తు మేర సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. 7.1 తీవ్రత భూకంపం పరిణామాలను అధికారులు అంచనా వేస్తున్నారు.

జపాన్ ఇషికావాలోని ఉత్తర–మధ్య ప్రాంతంలో కూడా ఈ మధ్య కాలంలో స్వల్ప ప్రకంపణలు వచ్చాయి. నోటో ద్వీపకల్పం ఉత్తర భాగంలో 5.9 తీవ్రతతో భూకంపం సంభవించగా, కొన్ని నిమిషాల వ్యవధిలోనే పలు ప్రాంతాల్లో 4.8 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. అయితే ఆ సమయంలో సునామీ హెచ్చరికలేవీ జారీ చేయలేదు. తాజా భూకంపంతో అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. సముద్రం, నదుల వైపుఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.





# నాగచైతన్య-శోభిత నిశ్చితార్థం

- ప్రకటించిన నాగార్జున

**బలగం టీవీ, హైదరాబాద్**

సమంతతో విడాకులు తీసుకున్న నాగచైతన్యకు తాజాగా నటి శోభితా ధూళిపాళ్లతో నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని ఆయన తండ్రి హీరో నాగార్జున ప్రకటించారు. గురువారం ఉదయం ఈ జంటకు నిశ్చితార్థం జరిగిందని ఆయన తెలిపారు. ఆమెను తమ కుటుంబంలోకి సంతోషంగా స్వాగతిస్తున్నామని నాగార్జున అన్నారు. అలాగే ఈ ప్రేమ, సంతోషం జీవితాంతం కొనసాగాలని నాగార్జున ఆకాంక్షించారు. హద్దులేని ప్రేమకు నాంది ఈ రోజు అని అన్నారు. ఈ హ్యాపీ కపుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వీరి నిశ్చితార్థం ఇరు కుటుంబాల సమక్షంలో చాలా సింపుల్ గా జరిగినట్లు తెలుస్తోంది.

2017లో నటి సమంత, నాగచైతన్య ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే, ఆ తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలం దూరంగా ఉన్నారు. అనంతరం 2021 అక్టోబర్‌లో విడిపోతున్నట్టుగా ప్రకటించారు. ఆ తర్వాత కొంతకాలానికి చైతూ–శోభిత జంటపై పుకార్లు మొదలయ్యాయి. ఇద్దరూ ప్రేమించుకుంటున్నారని, సహజీవనం చేస్తున్నారనీ కూడా చాలా రోజులుగా రూమర్స్ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే.

**ఎవరీ శోభితా ధూళిపాళ్ల..!**

శోభిత ఏపీలోని తెనాలికి చెందిన అమ్మాయి. 1993, మే 31న వేణుగోపాల్ రావు, శాంతరావు దంపతులకు తెనాలిలో శోభిత జన్మించారు. ఆమెది బ్రాహ్మణ కుటుంబం. శోభిత ధూళిపాళ్ల తండ్రి మర్చంట్ నేవీలో ఇంజనీర్‌గా పనిచేసేవారు. తల్లి గవర్నమెంట్ టీచర్. వైజాగ్ లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్లో తన చదువు పూర్తి చేశారు. ఆ తర్వాత తండ్రి ఉద్యోగరీత్యా ముంబైకి మారారు. ముంబై యూనివర్సిటీ, హెచ్ఆర్ కాలేజీలో కామర్స్ అండ్ ఎకనామిక్స్ పూర్తిచేసింది. 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచిన శోభిత.. ఆ తర్వాత 2016లో 'రామన్ రాఘవన్' అనే తమిళ సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పలు తెలుగు, హిందీ, మలయాళ చిత్రాల్లోనూ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'పొన్నియిన్ సెల్వన్', 'మేజర్' సినిమల్లో సూపర్ పెర్ఫామెన్స్తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. హాలీవుడ్ లోనూ ఇటీవలే ఆమె అడుగుపెట్టింది. ఆమె సంప్రదాయ నృత్యాలైన భరతనాట్యం, కూచిపూడిలలో కూడా శిక్షణ తీసుకున్నారు.

# రెజ్లింగ్ గెలిచింది.. నేను ఓడిపోయా

- కుస్తీకి ఇక గుడ్ బై
- రెజ్లర్ వినేశ్ ఫోగాట్
- ఎక్స్‌లో రిటైర్‌మెంట్ ప్రకటించిన స్టార్ రెజ్లర్

**బలగం టీవీ, పారిస్**

'నాపై రెజ్లింగ్ గెలిచింది.. నేను ఓడిపోయా..' అంటూ భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్ ఆటకు గుడ్ బై చెప్పింది. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

'రెజ్లింగ్ నాపై గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించు. మీక, నా ధైర్యం విచ్ఛిన్నమైంది. నాకు ఇంకా పోరాడే బలం లేదు' అని పేర్కొంది. రెజ్లింగ్ 2001–2024 గుడ్‌బై అంటూ ట్వీట్ చేసింది.

పారిస్ ఒలింపిక్స్ 50 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు అధికంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడింది. అయితే తనను అనర్హురాలిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఫోగాట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేసన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. తనను సిల్వర్ మెడల్‌కు అర్హురాలినని తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలుస్తున్నది. దీనిపై ఆర్బిట్రేషన్ తీర్పు వెలువరించాల్సి ఉన్నది. ఈలోపే ఆమె అనూహ్యంగా వీడ్కోలు ప్రకటించింది.

గత రెండు ఒలింపిక్స్‌లను తలపిస్తూ పారిస్‌లోనూ వినేశ్‌కు చేదు అనుభవమే ఎదురైంది. రియోలో కాలు విరిగితే..టోక్యోలో ఆదిలోనే ఓటమి..ఇప్పుడు పారిస్‌లో అనర్హత వేటు ఫోగాట్ పతక కలను చిదిమేశాయి. గత ఏడాది కాలంగా పాలకులతో చేస్తున్న పోరాటం ఓవైపు అయితే తనపై వస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేందుకు బౌట్‌లో శక్తికి మించి పోరాడిన వినేశ్..పారిస్‌లో పతకమే లక్ష్యంగా పోటీకి దిగింది. తన రెగ్యులర్ విభాగం 53కిలోలు కాకుండా ఈసారి 50కిలోల కేటగిరీ ఎంచుకున్న ఫోగాట్‌కు యు సుసాకీ రూపంలో ఫేవరేట్ ఎదురైనా వెరువకుండా పోరాడి సంచలన విజయం సాధించింది. అదే జోరులో క్వార్టర్స్, సెమీస్ బౌట్లలో ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా నిలిచింది.



"రెజ్లింగ్ నాతో మ్యాచ్ గెలిచింది, నేను ఓడిపోయాను. మీ కలలు, నా ధైర్యం చెదిరిపోయాయి. నాకు ఇప్పుడు బలం లేదు. కుస్తీకి గుడ్ బై 2001-2024. నేను మీ అందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటాను. క్షమించండి" అంటూ ఎక్స్ లో వినేష్ ఫోగట్ పోస్ట్ చేశారు.



# అమెరికా రెజ్లర్ సారా ఆన్ హిల్డెబ్రాండ్‌కు గోల్డ్ మెడల్

**బలగం టీవీ, పారిస్**



భారత రెజ్లర్ వినేశ్ ఫోగట్ అధిక బరువు వల్ల పారిస్ ఒలింపిక్స్ 50 కేజీల రెజ్లింగ్ ఫైనల్లో డిస్‌క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. అయితే ఫైనల్లో ఆడాల్సిన అమెరికా రెజ్లర్ సారా ఆన్ హిల్డెబ్రాండ్‌కు .. గోల్డ్ మెడల్‌ను అందజేశారు. వాస్తవానికి ఫైనల్‌లో భారత స్టార్ రెజ్లర్‌ను ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నానని, కానీ ఆ రోజు ఉదయం అనుకోని పరిణామాలు చోటుచేసుకున్నట్లు ఆమె చెప్పారు. వినేశ్‌పై అనర్హత వేటు వేయడంతో.. ఫైనల్లో ఆమె స్థానంలో క్యూబా రెజ్లర్ యుసునెలిస్ గుజ్మెన్ లోపేజ్ ఆడింది. సెమీస్‌లో లోపేజ్‌ను వినేశ్ ఓడించిన విషయం తెలిసిందే.

ఫైనల్ కోసం ప్రిపేరయ్యానని, కానీ మ్యాచ్‌కు ముందు జరిగిన పరిణామాలు పెద్దగాతెలియదని హిల్డెబ్రాండ్ తెలిపారు. 30 ఏళ్ల ఆ రెజ్లర్.. టోక్యో గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ గెలిచింది. అయితే వెయిట్ చెకింగ్ సమయంలో వినేశ్‌ను గుర్తించలేదని ఆమె అన్నారు. బహుశా భారత రెజ్లర్ తప్పుకుని ఉంటుందని అనుకున్నట్లు ఆమె చెప్పింది. ఓ మై గాడ్, ఇలాంటిది ఏమైనా జరిగి ఉంటుందా అని అనుకున్నట్లు ఆమె తెలిపింది. అయితే ఆ తర్వాత తమకు న్యూస్ అందిందని, వెయిట్ చెకింగ్‌లో వినేశ్ విఫలమైనట్లు తెలిసిందని హిల్డెబ్రాండ్ పేర్కొన్నది. ఆ సమయంలో ఆమె తప్పుకోనున్నట్లు తమకు అర్థమైనట్లు వెల్లడించింది. వినేశ్ ఆడదని తెలిసిన తర్వాత తాము సెలబ్రేషన్‌లో మునిగినట్లు చెప్పింది.

# జాతీయ పోటీల్లో తెలంగాణ స్విమ్మర్‌కు కాంస్యం



- అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డిఔ

**బలగం టీవీ, భువనేశ్వర్**

ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ జాతీయ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ కుమార్ టీఎస్ తేజస్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. 100 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో స్విమ్మర్ తేజస్ మూడో స్థానంలో నిలవగా.. మొదటి రెండో స్థానాల్లో.. మిజోరాంకు చెందిన లాంచెన్‌బా లైటోంజమ్, కర్ణాటకకు చెందిన థాకురియా అక్షజ్ రెండో స్థానాల్లో నిలిచారు.

తేజస్ కాంస్య పతకం సాధించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కాంస్య పతకం గెలుచుకున్న తెలంగాణ బిడ్డ తేజస్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాభినందనలు తెలిపారు. తేజస్ అద్భుత ప్రదర్శన తెలంగాణకు గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే రాణించి.. మరిన్నో విజయాలను సాధించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.